## 319 వ అధ్యాయం

## ٣١٩ - بَابُ كَرَاهَةِ أَنْ يَسْأَلَ الإِنْسَانُ بِوَجْهِ اللهِ عَزَّ وَجَلَّ غيرَ الْجَنَّةِ، وَكَرَاهَةِ منعِ مَنْ سَأَلَ باللهِ تَعَالَى وتَشفَّعَ بِهِ

## అల్లాహ్‌ను స్వర్గంగాకుండా వేరితర వస్తువులు ప్రసాదించమని అర్థించటం అవాంఛనీయం, అలాగే ఎవరైనా అల్లాహ్ పేరు తీసుకొని యాచిస్తే లేక అల్లాహ్ పేరు తీసుకొని మరీ ఎవరి గురించి అయినా సిఫారసు చేస్తే వారికి ఇవ్వకుండా ఉండటం, వారి సిఫారసును ఆమోదించకపోవటం కూడా అవాంఛనీయమే.

١٧٢٤ - عَنْ جَابِرٍ رَضِيَ اللهُ عَنْهُ قَالَ: قَالَ رَسُولُ اللهِ ﷺ: «لا يُسْأَلُ بِوَجْهِ اللهِ إِلَّا الجَنَّةُ» رواه أبو داود.

1724. హజ్రత్ జాబిర్ (రజి) కథనం ప్రకారం దైవప్రవక్త (సఅసం) ఇలా ప్రబోధించారు: అల్లాహ్ పేరుని ఆధారంగా చేసుకొని స్వర్గాన్ని తప్ప మరే ఇతర వస్తువునీ యాచించటం తగదు. (అబూదావూద్)

(సునని అబూదావూద్‌లోని జకాత్ ప్రకరణం)

### ముఖ్యాంశాలు

గమనిక: ఈ హదీసుని ఆధారంగా చేసుకొని పై శీర్షిక సారాంశాన్ని నిరూపించటానికి ప్రయత్నించటం ఎన్నో విధాలుగా సమంజసం కాదని షేఖ్ అల్‌బానీ (రహ్మలై)గారు అభిప్రాయపడ్డారు.

1) ఆధారాల రీత్యా ఈ హదీసు బలహీనమైనది. 2) ఒకవేళ దీని ప్రామాణికతను ఒప్పుకున్నప్పటికీ దీని ఆధారంగా 'అల్లాహ్‌ను స్వర్గం తప్ప మరే వస్తువునూ అర్థించరాదు' అన్న విషయాన్ని నిరూపించటం మాత్రం సరికాదు. మహా అంటే దీని ద్వారా మనం అల్లాహ్‌ను శాశ్వతమైన స్వర్గాన్ని వదలిపెట్టి తాత్కాలికమైన ప్రాపంచిక ప్రయోజనాలను కోరుకోవటం సమంజసం కాదని మాత్రం చెప్పగలం. అంతేగాని, దీనికంటే సూక్ష్మమైన భావం ఏదీ ఇందులో లేదు. ఒక వ్యక్తి నేరుగా స్వర్గాన్ని కోరకుండా స్వర్గానికి గొనిపోయే సన్మార్గాన్ని,

రుజువర్తనను ప్రసాదించమని అల్లాహ్‌ను వేడుకున్నాడనుకోండి, దాన్ని మనం నిషిద్ధకార్యంగా తలపోయలేము కదా! 3) ఇంకో విషయం ఏమిటంటే గ్రంథకర్త ఇమామ్ నవవీ (రహ్మాలై)గారు శీర్షికలో అలా చేయటం అవాంఛనీయం అని అన్నారు గాని నిషిద్ధం అని మాత్రం అనలేదు. ఇమామ్ నవవీగారు షాఫయీలను అనుసరిస్తారు. షాఫయీలు అవాంఛనీయం (కరాహత్) అన్న పదాన్ని 'నిషిద్ధం' (హరామ్, మమ్‌నూ) అన్న అర్థంలోగాకుండా కేవలం అయిష్టకరం అన్న అర్థంలో మాత్రమే తీసుకుంటారన్న విషయం కూడా ఈ సందర్భంగా గమనార్హం. (అల్‌బానీ గారి తాలీఖాతుల్ మిష్కాత్, మొదటి సంపుటి 605వ పేజి). మొత్తానికి బోధపడే దేమిటంటే అల్లాహ్‌ను ప్రాపంచిక ప్రయోజనాలు ప్రసాదించమని ప్రార్థించటం అయిష్టకరం. అయితే అసలు ప్రాపంచిక వస్తువుల కోసం ప్రార్థించరాదని మాత్రం ఎక్కడా లేదు.

١٧٢٥ ـ وَعَنِ ابْنِ عُمَرَ رَضِيَ اللهُ عَنْهُمَا قَالَ: قَالَ رَسُولُ اللهِ ﷺ: «مَنِ اسْتَعَاذَ بِاللهِ، فَأَعِيذُوهُ، وَمَنْ سَأَلَ بِاللهِ، فَأَعْطُوهُ، وَمَنْ دَعَاكُمْ، فَأَجِيبُوهُ، وَمَنْ صَنَعَ إِلَيْكُمْ مَعْرُوفاً فَكَافِئُوهُ، فَإِنْ لَمْ تَجِدُوا مَا تُكَافِئُونَهُ، فَادْعُوا لَهُ حَتَّى تَرَوْا أَنَّكُمْ قَدْ كَافَأْتُمُوهُ» حَدِيثٌ صَحِيحٌ رواه أبو داودَ، والنسائي بأسانيدِ الصحيحين.

1725. హజ్రత్ ఇబ్నె ఉమర్ (రజి) కథనం ప్రకారం దైవప్రవక్త (సల్లం) ఇలా ప్రబోధించారు: దేవుని పేరు తీసుకొని ఎవరైనా మిమ్మల్ని శరణు వేడితే వారికి శరణు ఇవ్వండి. దేవుని పేరు మీద ఏదైనా అడిగితే వారికి ఇచ్చేయండి. ఎవరైనా మిమ్మల్ని ఆహ్వానిస్తే ఆ ఆహ్వానాన్ని అంగీకరించండి. మీకు ఎవరైనా ఉపకారం చేస్తే మీరు దానికి ప్రత్యుపకారం చేయండి. ప్రత్యుపకారం చేసే స్తోమత గనక మీలో లేకపోతే వారి శ్రేయస్సు కోసం ప్రార్థించండి. మీకు వారి రుణం తీర్చుకున్నామని నమ్మకం కలిగేంత వరకూ (ఆ విధంగా ప్రార్థిస్తూ ఉండండి.)

ఈ హదీసు సహీహ్ కోవకు చెందినది. అబూదావూద్ మరియు నసాయీలు దీనిని బుఖారీ-ముస్లింల ఆధారాలతో వెలికితీశారు.

*(సుననె అబూదావూద్‌లోని జకాత్ ప్రకరణం చివర్లో - సుననె నసాయిలోని జకాత్ ప్రకరణం)*

## ముఖ్యాంశాలు

1) దేవుని పేరు తీసుకొని అర్థించటంలో తప్పులేదు. 2) ఆ విధంగా దేవుని పేరు తీసుకొని అర్థించేవారిని ఒట్టి చేతులతో త్రిప్పిపంపకూడదు. దైవనామం గౌరవార్థం వారి అవసరాన్ని తీర్చాలి. అయితే ముష్టెత్తే వృత్తికి పాల్పడుతున్న వారికి ఇవ్వకుండా ఉండటం మంచిది. దానివల్ల ఇస్లామీయ రాజ్యంలో భిక్షాటనను నిరుత్సాహపరచినట్లవుతుంది. 3) ఉపకారానికి బదులుగా ఉపకారం చేయాలి. ఒకవేళ స్తోమత లేకపోతే ఉపకారి శ్రేయస్సు కోసం అత్యంత ఎక్కువగా ప్రార్థించాలి. ప్రార్థించటం కూడా ఋణం తీర్చుకోవటానికి ఒక రూపం. 4) ఆహ్వానించబడిన చోట ధర్మవిరుద్ధకార్యాలు జరగకుంటే అలాంటి ఆహ్వానాన్ని తప్పకుండా స్వీకరించాలి.